# గంగా తపస్సు - ఒక పరిచయం

డా. అపర్ణ యేలూరిపాటి, బ్రిడ్జివాటర్, న్యూజెర్సీ

కొన్ని కొన్ని కథలు చదివినప్పుడు, కొన్ని సినిమాలు చూసినప్పుడు మనల్ని చాలారోజులు ఆ పాత్రలు వెంటాడతాయి. ఇది ఇలాగే ఎందుకు జరిగింది? ఇలా అయితే ఎలా ఉండేది? అని మనం చాలా ఆలోచిస్తాం. రచయిత ఇలా రాసి ఉంటే, ముగింపు ఇలా కాక మరోలా ఉండి ఉంటే, అని ఎంతో మథనపడతాం. అలాంటి ఆలోచన ఆ రచయితకే కలిగితే, అప్పటి తన పరిణతికి అనుగుణంగా, తన కథని తనకి నచ్చినట్టు కొంత మార్చి, మరికొంత చేర్చి, మళ్ళీ తనకి నచ్చిన రూపాన్ని ఇవ్వగలుగుతాడు. మరింత అందంగా మలచగలుగుతాడు. అసలు ఇలా ఒక కథకి కొనసాగింపుతో మరొక కథ రావటం, ఒక అందమైన రచనా ప్రక్రియ. మొదటి కథ విజయవంతమయ్యిందనటానికి ఇది ఒక నిదర్శనం కూడా. అలాంటి చక్కని పాత్రల కల్పనలతో, సన్నివేశాల కూర్పుతో పొడిగించబడ్డ కథే ఈ "గంగాతపస్సు". (తమిళంలో "గంగై ఎంగే పోగిరాళ్"). రచయిత జయకాంతన్ ముద్దుబిడ్డ.

1966లో 'ఆనందవికటన్' పత్రికలో ప్రచురింపబడ్డ జయకాంతన్ రచించిన "అగ్నిప్రవేశం" అనే ఒక చిన్నకథ, తమిళనాడులో ఎంతోమంది విమర్శలను ఎదుర్కొని, ఎంతమందికో చర్చనీయాంశమయ్యింది. ఆరేళ్ళ తర్వాత మళ్ళీ ఆ రచయిత చేతనే "సిల నేరంగళిల్, సిలమనిథర్గళ్" అనే పేరుతో పొడిగించబడి, ప్రతిష్ఠాకరమైన కేంద్రీయ సాహిత్య అకాడెమీ పురస్కారాన్ని కూడా పొందింది. రచయితకి ఆ కథపట్ల, పాత్రలపట్ల ఆత్మీయత మరింత పెరిగింది. అయితే గంగ పాత్రలోనో ఆమె జీవనవిధానంలోనో ఇంకా ఏదో అసంతృప్తి ఆయన్ను వెంటాడినట్లుంది. మళ్ళీ అదే కథను పొడిగించి "గంగై ఎంగే పోగిరాళ్"గా అందించారు శ్రీ జయకాంతన్. దీన్ని తెలుగులోకి యథాతథంగా ముఖ్యంగా కథయొక్క శైలికి, వాతావరణానికి, ఏమాత్రం భంగం కలిగించకుండా "గంగాతపస్సు"గా అనువదించారు ఏండి సుందరేశన్.

అగ్నిప్రవేశం చిన్న కథ. మూడే పాత్రలు. తల్లి, కొడుకు, కూతురు. ఆ కూతురు పదమూడేళ్ళ చిన్నపిల్ల. ఒకరోజు అనుకోకుండా ఒకతని చేత భంగపడుతుంది. ఆ విషయాన్ని ఆమె ఇంటికి వచ్చి తల్లికి చెప్పినప్పుడు ఆ తల్లి బాగా ఏడ్చి, జరిగినదానికి ఏమి చెయ్యలో తెలియక, కూతుర్ని చంపెయ్యాలనుకుని, చివరికి గంగ తప్పు మాత్రం ఏముందిలెమ్మని సమాధానపడి, ఆమెకు తలస్నానం చేయించి, ఆమె ఒంటి మీద పోసినవి నీళ్ళు కాదని, అగ్నితో స్నానం చేసినట్టుగా భావించమని, జరిగినదాన్ని ఎవరితోనూ చెప్పవద్దని, తిరిగి మామూలు జీవితాన్ని గడపమని చెప్పటంతో కథ ముగిసిపోతుంది. అన్యాయమైపోయిన కూతురిని కడుపులో పెట్టుకుని కాపాడే తల్లి మనస్తత్వాన్ని ఇక్కడ చూపించాడు రచయిత. ఆ రోజుల్లో ఇది నిజంగానే విప్లవాత్మకమైన ముగింపు.

అయితే ఆ ముగింపు చాలామందికి నచ్చలేదు. ఈ పరిష్కారం సమాజానికి నష్టం కలిగించేదిగా ఉందని కొంతమంది ధ్వజమెత్తారు. దీనికి పొడిగింపుగా ఆ ముగింపును మారుస్తూ మరెన్నో కథలుకూడా వచ్చాయి (చివరికి ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకున్నట్టుగా కూడా).

అవన్నీ సావధానంగా పరిశీలించిన జయకాంతన్ ఆరు సంవత్సరాల తర్వాత తన కథను తనే పొడిగిస్తూ "సిల నేరంగళిల్, సిలమనిథర్గళ్" నవలగా అందించారు. (ఆ నవలని తెలుగులోకి మాలతీ చందూర్ అనువదించారు). ఆ కథలో గంగ మానసిక సంఘర్షణ, వేదన చాలా సున్నితంగా చిత్రించారు జయకాంతన్. చిన్నప్పుడే అన్యాయానికి గురి అయిన గంగ మామయ్య ప్రోద్బలంతో పట్టభద్రురాలై, ఉద్యోగం చేస్తూ, ఆ మామయ్యే తనపట్ల వెకిలితనాన్ని చూపితే భరిస్తూ, "గంగకి సమర్థత ఉంటే వాణ్ణి వెతికి పట్టుకొమ్మను" అని మామయ్య చేసిన చాలెంజితో తనకు నష్టం చేసిన వ్యక్తి కోసం ప్రయత్నించి, చివరికి తన కథలాంటి కథని రచించిన రచయిత ఆర్.కే.వీ. సహాయంతో తను వెతుకుతున్న వ్యక్తి 'ప్రభు' అని తెలుసుకుంటుంది. అతనికి కూడా తానెవరో తెలియచేస్తుంది.

ప్రభు ప్రవర్తన, స్నేహశీలత నచ్చిన గంగ అతనికి దగ్గరవ్వాలని ప్రయత్నిస్తుంది. అతనితో జీవితం గడపాలని ఆశ పడుతుంది. కాని అతనికి ఆ ఉద్దేశ్యం ఏ కోశానా లేదు. ఆమెకు పెళ్ళి చేసి, మంచి జీవితాన్ని ఇవ్వాలని అతని తపన. ఈ గొడవల మధ్య అతను ఆమెనుంచి దూరమవుతాడు. ఒంటరిగా మిగిలిపోయిన గంగ చివరికి ఆ మానసిక వేదననుంచి దూరంకావటానికి తాగుడుకు బానిస అయిపోతుంది. ఇది "సిల నేరంగళిల్, సిలమనిథర్గళ్" కథకి ముగింపు. ఆత్మవిశ్వాసానికి, పట్టుదలకి నిదర్శనంగా నిలిచిన గంగ పరిస్థితులకి లొంగి నిస్సహాయంగా నిలవటం ఒకింత బాధని కలిగిస్తుంది. (తర్వాతికాలంలో (గంగ పాత్రలో లక్ష్మి నటించగా) చలనచిత్రం కూడా వచ్చింది).

ఆ నవల సాహిత్య అకాడెమీ బహుమతిని పొందినప్పటికీ, కథ చివరిలో కథానాయిక ప్రపంచాన్ని ఎదిరించి పోరాడుతున్న వీరనారిలాగా "డోంట్ కేర్" అని భుజాన హేండ్ బేగ్ వేసుకుని కనబడినా, ఆమె తాగుడుకు అలవాటుపడి మెంటల్ పేషెంట్ లాగా గతకాలపు ఉపద్రవాలు తలపోసుకుంటూ మిగిలిపోవటం నచ్చని జయకాంతన్ తర్వాత మళ్ళీ ఐదు సంవత్సరాల తర్వాత అదే కథను పొడిగించి ఈ నవలని రచించారు. ఆ విషయాన్ని ఆయనే తన ముందుమాటలో ఇలా చెప్పారు - "కథ అన్నది పాత్రలు జీవితంలో విరక్తి చెంది, కుంగిపోయి మరణించటంతోనే, వ్యథలపాలు కావటంతోనే ముగిసిపోకూడదు. ఇవన్నీ మనిషిజీవితంలో ఎదురయ్యే కొన్ని సంఘటనలు మాత్రమే. మంచి రచయిత పాఠకులకు ఆశనూ పట్టుదలనూ పెంచాలి కాని, నిరుత్సాహాన్ని కలిగించకూడదు".